# కర్నాటకలో బాలగోపాల్

**ఎన్. రమేశ్,** పీపుల్స్ డెమొక్రాటిక్ ఫోరం సభ్యుడు

**పీ**పుల్స్ డెమొక్రాటిక్ ఫోరం (పిడిఎఫ్) 1993 నుండి కర్నాటకలో, బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న మానవ హక్కుల సంస్థ. 1992 డిసెంబర్ 6వ తేదీన సంఘపరివార్ శక్తులు అయోధ్యలో బాబ్రి మసీదును ధ్వంసం చేసిన నేపథ్యంలో బెంగళూరులోని కొందరు అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, పాత్రికేయులు కలిసి ముఖ్యంగా మత ఛాందస వాదానికి విరుద్ధంగా కార్యక్రమాలు చేపట్టాలనే ఉద్దేశంతో ఈ సంస్థను ప్రారంభించారు. అంతేకాక, సమాజంలో కులం కారణంగా అన్యాయాలకు, దౌర్జన్యానికి గురయ్యే దళితులు, పోలీసుల దౌర్జన్యాన్ని అనుభవించే అమాయకులు, ప్రభుత్వాల ఆర్థిక నీతివల్ల నష్టపోయే రైతులు మరియు ఇతర సామాన్య ప్రజలు – ఇటువంటి అంశాలపైన కూడా దృష్టిసారించి వీటి గురించి నిజనిర్ధారణ వంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో అవగాహనను పెంచడం ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం.

పి.డి.ఎఫ్. ప్రారంభమయ్యే నాటికే కర్నాటకలోనూ, దేశంలోనూ, ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రంలో ఎన్నో మానవ హక్కుల సంస్థలు పనిచేస్తున్నాయి. వాటిలో ప్రధానంగా పేర్కొనదగినది ఎపిసిఎల్సి. పిడిఎఫ్ పుట్టిన నాటినుండి ఎపిసిఎల్సితో కలిసి ఎన్నో కార్యక్రమాల్ని నడిపింది. దేశంలో వేరు వేరు చోట్ల నిజనిర్ధారణ కమిటీలలో ఎపిసిఎల్సితో పాటు పాల్గొంది.

అప్పటికే బాలగోపాల్ దేశంలోని మానవ హక్కుల ఉద్యమం ముందు వరుస నాయకుడిగా గుర్తింపు పొంది వున్నారు. ఎపిసిఎల్సి ప్రధాన కార్యదర్శిగా తన సంస్థను ముందుకు నడపడంతో పాటు వివిధ రాష్ట్రాలలోని మానవ హక్కుల సంఘాలతో సన్నిహిత సంబంధాలను పెంపొందించడం ద్వారా దేశవ్యాప్తంగా ఈ సంస్థలన్నీ కలిసికట్టుగా పనిచేయగల వాతావరణాన్ని నిర్మించి ఉన్నారు. సహజంగానే

పిడిఎఫ్ కూడా ఈ సంఘటిత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంది. ఇలా చేయడంవల్ల ఒక విశాల ప్రాతిపదిక మీద అవగాహనను పెంచుకోవడం పిడిఎఫ్‌కు సాధ్యమైంది.

పలు సందర్భాలలో బాలగోపాల్ బెంగళూరులో పిడిఎఫ్ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని సమస్యల గురించి తనకున్న గాఢ పరిచయాన్ని మాత్రమే కాదు, వాటికి తగిన పరిష్కార మార్గాల్ని సూచించి ఇక్కడి వారికి కనువిప్పు కలిగించారు. కాబట్టి ఏదైనా కార్యక్రమం ఏర్పాటు చేసేటప్పుడు ముఖ్య వక్తగా బాలగోపాల్ పేరునే పిడిఎఫ్ సభ్యులు గుర్తుచేసుకునేవాళ్ళు. అంతేకాక, వేరే ఎన్నో సంస్థలు కూడా బాలగోపాల్‌ను తమ కార్యక్రమాలకు ఆహ్వానిస్తూ ఉండేవారు. ఈ విధంగా ఇక్కడి సామాజిక సంస్థలలో పని చేసే వారికి బాలగోపాల్ బాగా పరిచితుడయ్యారు. ప్రారంభదశలో పి.డి.ఎఫ్ తన సభ్యుల కోసం ఏర్పాటు చేసిన మూడు రోజుల వర్క్ షాపులో నిజనిర్ధారణకు వెళ్ళినప్పుడు మానవహక్కుల సంఘాలు తీసుకోవలసిన జాగ్రత్తలు, విషయాలను సేకరించవలసిన రీతుల గురించి క్షుణ్ణంగా వివరించారు. ఇప్పటికీ మా సంస్థ ఆ దారిలోనే తన నిజనిర్ధారణ కార్యక్రమాలను కొనసాగిస్తున్నది.

1990 తర్వాత భారత ప్రభుత్వం చేపట్టిన నూతన ఆర్థిక విధానాల పర్యవసానంగా సామాన్యులు ఏవిధంగా నష్టపోబోతున్నారన్నదాన్ని గురించి ఆయన చేసిన ఉపన్యాసాలు ఇప్పటికీ విన్నవారి జ్ఞాపకాలలో నిలిచి ఉన్నాయి. కాశ్మీరు ప్రజల ప్రముఖ డిమాండ్ అయిన స్వయం నిర్ణయాధికారం గురించి ఆయన అభిప్రాయాలు కర్నాటకలోని చాలామందిని ప్రభావితం చేసి ఉన్నాయి. ప్రజా ప్రభుత్వమంటే కేవలం ప్రజలను చంపక పోవడం మాత్రమే కాదు, వారి రాజకీయ, సాంస్కృతిక ఆకాంక్షలను గుర్తించి వాటిని సాకారం చేసుకొనే అవకాశాలను వారికి కల్పించడం కూడా; ఆ ఆకాంక్షలు దేశం నుండి విడిపోయే పరిస్థితిని తెచ్చిపెట్టినా కూడా, అది వారి మౌలికమైన హక్కును నిరాకరించడానికి తగిన కారణం కాదన్న ఆయన వాదాన్ని అందరూ కాకపోయినా, ప్రజా ప్రభుత్వాన్ని నిజంగా అర్థం చేసుకునేవారంతా ఒప్పుకుంటారు. ఇటువంటి చిక్కు ముడులతో నిండిన సమస్యల గురించి బెంగళూరు లోను, కర్నాటకలోని మరికొన్ని చోట్లా బాలగోపాల్ ఉపన్యాసాలు ఇచ్చి ఉన్నారు.

1998లో ఎపిసిఎల్‌సిలోని ఇతర సభ్యులతో వచ్చిన అభిప్రాయ భేదాలవల్ల బాలగోపాల్ ఎపిసిఎల్‌సి నుంచి వైదొలగి మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్)ను స్థాపించిన విషయం అందరికీ తెలిసిందే. అయినప్పటికీ ఆయన ఎప్పుడూ కూడా, ఆంధ్రరాష్ట్రంనుండి దూరంగా ఉన్నప్పుడు కూడా, తన మాతృ సంస్థ గురించి చులకనగా మాట్లాడింది లేదు. పి.డి.ఎఫ్ ఎప్పటి మాదిరిగానే ఎపిసిఎల్‌సితో తన పాత సంబంధాలను కొనసాగించింది. ఈ విషయం పిడిఎఫ్‌కూ బాలగోపాల్‌కూ నడుమగానీ, పిడిఎఫ్‌కూ హెచ్ఆర్ఎఫ్‌కూ నడుమగానీ సమస్య కాలేదు.

## కన్నడంలో బాలగోపాల్ పుస్తకాలు

సంఘపరివార్ శక్తులు తమ దౌర్జన్యపూరిత కార్యక్రమాలు నడుపుతున్న సమయంలో అఖిల భారత నిజనిర్ధారణ కమిటీలో భాగంగా బాలగోపాల్ గత ఏడాది కూడా ఈ రాష్ట్రానికి వచ్చారు. ఒరిస్సాలో లక్ష్మణానందస్వామి హత్యను నెపంగా చేసుకుని అక్కడి క్రైస్తవుల మీదా, వారి చర్చిల మీదా దాడి చేసిన విధంగానే, కర్నాటకలో ముఖ్యంగా కోస్తా ప్రాంతాల్లో (మంగళూరు, ఉడుపి జిల్లాలు) క్రైస్తవులు మత మార్పిడులకు పాల్పడుతున్నారని అభాండాలు వేస్తూ వాళ్ళ ప్రార్థనా మందిరాలపైనా, వారిపై దాడులు జరిపిన సంఘపరివార్ శక్తుల అకృత్యాలను ఈ నిజనిర్ధారణ ద్వారా బయటికి తీసుకొచ్చారు. ఈ దాడులు జరిగినప్పుడు (ఇప్పుడు కూడా) కర్నాటకలో బిజెపి అధికారంలో ఉన్నందువల్ల క్రైస్తవులకు రక్షణగాని, ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థల కార్యకర్తలకు శిక్షగాని లేకుండా పోయాయి. అయితే దేశంలోని వేరు వేరు చోట్లనుండి వచ్చిన మానవహక్కుల వాళ్ళ చొరవ వలన ఆ దాడులకు కొద్దిగా విరామం వచ్చింది. 'ఫ్రం కంధమాల్, టు కరావళి – ద అగ్లీ ఫేస్ ఆఫ్ సంఘ్ పరివార్' పేరుతో నివేదిక ఈ దాడుల గురించీ, వాటి నేపథ్యాన్ని గురించీ వివరమైన విశ్లేషణ చేసింది. ఎప్పటి మాదిరిగానే ఈ నివేదికను తయారు చేయడంలో బాలగోపాల్‌గారి శ్రమ, పాత్ర అతి ముఖ్యమైనవి. తర్వాత ఇదే నివేదికను 'కంధమాల్‌నింద కరావళియవరెగే' అన్న పేరిట కన్నడానికి తర్జుమా చేసి పిడిఎఫ్ ప్రకటించింది.

కాశ్మీరీలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి నిజనిర్ధారణ కమిటీల రిపోర్టుల ఆధారంగా బాలగోపాల్ రాసిన 'కల్లోల లోయ' కూడా కన్నడానికి అనువదింపబడింది. ఆ పుస్తకం ప్రకటించిన తర్వాత 'విల్ ది పెయిన్ నెవర్ ఎండ్?' అన్న మరొక రిపోర్టును, మరికొన్ని విషయాలను అనుబంధాలుగా చేర్చి 'ప్రక్షుబ్ధకణివె' అనే శీర్షికన బెంగళూరులోని ప్రగతి గ్రాఫిక్స్ సంస్థ వారు ప్రకటించారు. ఇటీవలనే, 2009లో ప్రకటింపబడిన ఈ పుస్తకాన్ని పిడిఎఫ్‌కు చెందిన ఇద్దరు సభ్యులు సిద్ధం చేశారు.

బెంగళూరులోని వేర్వేరు సామాజిక సంస్థలు, విద్యా సంస్థలు తమ కార్యక్రమాలకు ఆయనను వక్తగా పిలిచిన ఇటీవలి సందర్భాలలో బాలగోపాల్ క్రైస్ట్ యూనివర్సిటీ విద్యార్థులనుద్దేశించి చట్టాల గురించి మాట్లాడారు. ఇదే యూనివర్సిటీ వాళ్ళు ఇంతకుముందు కూడా రెండు, మూడు సార్లు ఆయనను ఆహ్వానించి ఉన్నారు. శ్రీలంకలో ఎల్‌టిటిఇ పతనం తర్వాత తమిళుల ఊచకోతకు వ్యతిరేకంగా జరిగిన ఒక కార్యక్రమంలో బాలగోపాల్ పాల్గొని అన్యాయాలకు గురైన తమిళులకు సంఘీభావాన్ని ప్రకటించారు.

కర్నాటకలో చర్చిలమీద జరిగిన దాడులపై విచారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ అధ్యక్షుడు రిటైర్డ్ జస్టిస్ సోమశేఖర్ క్రైస్తవులను అనవసరంగా ఇబ్బంది పెట్టే రీతిలో విచారణను నడుపుతున్నారన్నదాన్ని గురించి ఆంధ్రజ్యోతిలో బాలగోపాల్ రాసిన వ్యాసం ఇటువంటి కమిషన్‌లు ఎలా పనిచేయరాదో అన్న విషయాన్ని విశదీకరిస్తుంది. 2009 అక్టోబరు మొదటివారంలో అనంతపురంలో జరిగిన హెచ్ఆర్ఎఫ్ మహాసభలలో పిడిఎఫ్ సభ్యులు ఇద్దరు ఆహ్వానితులుగా పాల్గొన్నారు. అంతవరకూ కార్యదర్శిగా ఉన్న బాలగోపాల్ ఆ పదవిని వదలి ఉపాధ్యక్షులలో ఒకరిగా ఎన్నికైనారు. పదవి ఏదయినప్పటికీ హెచ్ఆర్ఎఫ్‌కు బాలగోపాల్ నాయకత్వం ఆవశ్యకత మాత్రం ఎప్పటికీ తగ్గదనుకున్నాం. అయితే అక్టోబరు ఎనిమిదవ తేదీన ఆయన హఠాన్మరణం అందరిలాగే పిడిఎఫ్‌ను కూడా కదిలించి వేసింది. ఆయన గురించి తెలిసిన వారినందరినీ కలవరపరిచింది.

ఆయనకు శ్రద్ధాంజలి సమర్పించడానికి బెంగళూరులో ఏర్పాటు చేసిన సభలో వివిధ సంఘాలవాళ్ళు, బాలగోపాల్‌తో పరిచయమున్నవాళ్ళు పాల్గొన్నారు. అనంతపురం నుంచి చంద్రశేఖర్‌గారు ముఖ్య అతిథిగా ఆ సభకు వచ్చారు. బెంగళూరు వాస్తవ్యులైన రవీంద్రనాథ్ (బాలగోపాల్‌గారి అన్న), మరి కొందరు బంధువులు కూడా ఆ సభకు వచ్చారు. వాళ్ళ కుటుంబం తరఫున రవీంద్రనాథ్‌గారు బాలగోపాల్ గురించి మాట్లాడారు. ఆ సందర్భంలో బాలగోపాల్ ఇంటర్వ్యూలో కొంత భాగాన్ని ప్రదర్శించడం జరిగింది. బాలగోపాల్ మిత్రులు ఆయన వ్యాసాలు కొన్నిటిని కన్నడానికి అనువదించి ప్రకటించాలని నిర్ణయించారు. ఇప్పుడు ఆ ప్రయత్నాలు నడుస్తున్నాయి.

ఇక్కడ ఆయనను చూసినవాళ్ళు ముఖ్యంగా గుర్తుంచుకునేది, ఆయన సరళత. తాను గొప్ప నాయకుడ్ని అన్న అహంకారం లేకుండా చాలా సామాన్యుడిగానే ఆయన అందరితోనూ కలిసేవారు. ఎక్కువగా మాట్లాడకపోయినా, ఆయన తన చుట్టూ ఉన్నవాళ్లనుంచి ఎక్కువ దూరం పోయినవాడూ కాదు. పిడిఎఫ్ సభ్యులు బాలగోపాల్‌తో తమ స్నేహపూర్వక సంబంధాలను ఎప్పటికీ మరవలేరు. ఆయనతో కొన్ని విషయాలలో అభిప్రాయ భేదాలున్నవాళ్ళు కూడా ఆయన వాదనాపటిమను, నిబద్ధతను, సాదాసీదా జీవనాన్ని, సునిశిత విశ్లేషణా శక్తిని, ఏ విషయాన్నైనా సూటిగా, నేరుగా చెప్పగల ఆయన స్పష్టతనూ, విజ్ఞతనూ ఒప్పుకోకుండా, మెచ్చుకోకుండా ఉండలేరు.